నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 6 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

భూసారాన్ని కాపాడుకోవాలి : ఏరువాక శాస్త్రవేత్త మధుశేఖర్

మాట్లాడుతున్న ఏరువాక శాస్త్రవేత్త మధుశేఖర్

బొమ్మలరామారం, డిసెంబర్ 5 : భావితరాలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఉత్పత్తులను అందించే అవకాశం ఉండాలంటే భూమి సారాన్ని కాపాడుకోవాలని జిల్లా ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ మధుశేఖర్ అన్నారు. మండలంలోని మల్యాల, మైలారం, మర్యాల, చీకటిమామిడి గ్రామాల్లోని రైతు వేదికల వద్ద గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ పంటలు పండించడానికి అనువైన నేలలు గుర్తించడానికి మట్టి నమూనాలు సేకరించే పద్ధతులు, నేల ఆరోగ్య సూచికలు, నేల స్వభావాన్ని గురించి రైతులకు తెలియజేశారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు. రైతులు పంట మార్పిడితోపాటు మృత్తిక ఆరోగ్యాన్ని బట్టి ఎరువులు వాడుకోవాలని సూచించారు. ఏఓ దుర్గేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశాల్లో పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సింహ, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేశ్, ఏడీఏ శాంతినిర్మల, ఏఈఓలు వెంకటేశ్, మౌనిక, రాజేశ్వర్, వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ఘనత కేసీఆర్‌దే..

చేసిన అభివృద్ధిని చెప్పుకునే స్వేచ్ఛ లేదా? | సర్కారు తీరుపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

- మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతగా క్షీరాభిషేకం చేయకుండా పోలీసుల అడ్డగింత
- దూర ప్రాంతాల పోలీస్‌స్టేషన్‌కు నాయకుల తరలింపు
- అక్రమ అరెస్టులను ఖండించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నీలగిరి, డిసెంబర్ 5 : నల్లగొండ జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసి, నిధులు కేటాయించి దాదాపు నిర్మాణాన్ని పూర్తి చేసినందుకు కృతజ్ఞతగా బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, వారికి కృతజ్ఞతలు చెప్పాలని మెడికల్ కళాశాల వద్దకు చేరుకోగానే పోలీసులు వచ్చారు. క్షీరాభిషేకానికి అనుమతి లేదని వారిని నిలువరించారు. కళాశాల నిర్మాణం కేసీఆర్ కృషితోనే జరిగిందని అందుకు సహకరించాలని పోలీసులను బీఆర్ఎస్ నేతలు కోరారు. అనుమతులు లేవని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ఆదేశాలు జారీ చేశారు. బీఆర్ఎస్ నేతలు క్షీరాభిషేకం చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా వారిని అడ్డుకున్నారు. కేసీఆర్ చిత్రపటాన్ని బీఆర్ఎస్ నేతల నుంచి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో పోలీసులకు బీఆర్ఎస్ నేతలకు మధ్య కొంత తోపులాట జరిగింది. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి సుదూర ప్రాంతాల పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

నల్లగొండలో మెడికల్ కళాశాల వద్ద బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు క్షీరాభిషేకం చేయడం నేరమా?

- బీఆర్ఎస్ నల్లగొండ టౌన్ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్

నాంపల్లి : ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఉద్యమ నాయకుని చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడం నేరమా అని బీఆర్ఎస్ నల్లగొండ టౌన్ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్ అన్నారు. నల్లగొండలో మెడికల్ కళాశాల వద్ద కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేయడానికి ప్రయత్నించగా ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా భువనగిరి దేవేందర్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో మెడికల్ కళాశాలలు మంజూరు, నిధులు విడుదల చేసి నిర్మాణం పనులను పూర్తి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కృతజ్ఞతగా బీఆర్ఎస్ అధ్వర్యంలో కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేయడం నేరమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని చెప్పుకునే స్వేచ్ఛ కాంగ్రెస్ ప్రభుత్వంలో లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కాలేజీని కాంగ్రెస్ చేసిన అభివృద్ధిగా చెప్పుకుంటున్నదని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసి తమను పలు పోలీసు స్టేషన్లు తిప్పి నల్లగొండకు దూరంగా ఉన్న నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావడం ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నల్లగొండ నుంచి తరలించిన అనంతరం నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పోలీసులతో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు : మాజీ ఎమ్మెల్యే కంచర్ల

బీఆర్ఎస్ నేతల అరెస్టులను నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం కేసీఆర్ హయాంలో నాటి జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో మెడికల్ కళాశాలను మంజూరు చేశారని తెలిపారు. రూ.1,300 కోట్ల కేటాయించి నల్లగొండ పట్టణాభివృద్ధికి కృషి చేశారని, నల్లగొండ మెడికల్ కళాశాలకు రూ.250 కోట్లు కేటాయించి రూ.125 కోట్లతో భవన నిర్మాణం చేపట్టారని చెప్పారు. అందుకు కృతజ్ఞతగా కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని నిర్ణయిస్తే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు గొడవలు చేసేందుకు అక్కడికి వెళ్లలేదని, కేవలం కేసీఆర్‌కు కృతజ్ఞత చెప్పేందుకే వెళ్లారని తెలిపారు. రోడ్డు మీద క్షీరాభిషేకం చేస్తే అడ్డుకోవడం విచిత్రంగా ఉందన్నారు. చేతనైతే దాని కంటే ఎక్కువ అభివృద్ధి చేసి చూపించాలని, చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. అరెస్టు అయిన వారిలో నల్లగొండ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కౌన్సిలర్ మారగోని గణేశ్, మెరుగు గోపి, దండెంపల్లి సత్తయ్య, కంకణాల వెంకట్‌రెడ్డి, దొడ్డి రమేశ్, మాతంగి అమర్, వజ్జా శ్రీనివాస్, దేప రాంరెడ్డి, రఫీ, గణేశ్, పరమేశ్‌నాయక్, గోపగోని నర్సింహ, రవి, కోరె అంజయ్య, కందుల నరేందర్ తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న భూనిర్వాసితులు

ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలి

- ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన భూనిర్వాసితులు

చౌటుప్పల్, డిసెంబర్ 5 : చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ తదితర ప్రాంతాల ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీర్ హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ నెల 9 నుంచి నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో భూనిర్వాసితుల సమస్యలపై మాట్లాడాలని వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని లేదా బహిరంగా మార్కెట్ ధర చెల్లించాలని వినతిలో పేర్కొన్నారు. మిగతా రహదారులు ఓఆర్ఆర్ నుంచి 40కిలోమీటర్లు తీసుకొని, ఉత్తర భాగంలో మాత్రం 28కిలోమీటర్లకు పరిమితం చేయడంపై ప్రశ్నించాలని కోరారు. దీంతో స్పందించిన హరీశ్‌రావు రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతుల ప్రస్థాన అసెంబ్లీలో మాట్లాడి న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఆర్ బాధితుల సంఘం కన్వీనర్ చింతల దామోదర్ రెడ్డి, రైతులు జాల వెంకటేశం యాదవ్, సందగళ్ల మల్లేశ్ గౌడ్, జాల శ్రీశైలం యాదవ్, జాల నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి డిసెంబర్ 5 : రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పగిడిపల్లిలోని పాత డీఆర్‌డీఓ కార్యాలయంలో గురువారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఇస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకొని అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు ఇచ్చినట్లు తెలిపారు. మహిళలను బలోపేతం చేయడానికి జిల్లాలో 17 మండల సమాఖ్యల ద్వారా జిల్లా సమాఖ్యను ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళా శక్తి ద్వారా జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం పిరికిపంద చర్య

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 5 : మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, పార్టీ నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష కట్టి అరెస్టు చేయడం పిరికిపంద చర్యఅని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిల అక్రమ అరెస్టును నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగాన్ని రక్షించాలని దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కక్షపూరితంగా అరెస్తు చేస్తున్నదని, ఈ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న రేవంత్ సర్కార్‌కు బీఆర్ఎస్ పార్టీ తగిన గుణపాఠం చెప్తుందని హెచ్చరించారు. ప్రతిపక్ష పాత్రను పోషిస్తున్న బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన మాత్రాన భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చకుండా సంబురాలు చేసుకోవడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంత సేపు ప్రజలను మభ్య పెట్టే కార్యక్రమాలను చేస్తున్నదని మండిపడ్డారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలని,లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మన్నె ప్రభాకర్, మున్నా, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులకే సీఎం రేవంత్ ప్రారంభం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- జిల్లాకు ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం ఇవ్వాలి
- మాజీ మంత్రుల అక్రమ అరెస్టులు సరికాదు
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, డిసెంబర్ 5 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులిచ్చి పూర్తి చేసిన పనులనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని, జిల్లా ప్రాజెక్టుల పూర్తికి రూపాయి నిధులివ్వని ఆయన ఆ ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి రావడం సిగ్గుచేటని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. చిట్యాలలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 7న సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి థర్మల్ ప్లాంటు, మెడికల్ కాలేజీ, బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవానికి వస్తున్న ఆయన తన 11 నెలల పాలనలో ఈ ప్రాజెక్టులకు ఎన్ని నిధులు కేటాయించారో ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. జిల్లాను ఏ రకంగా అభివృద్ధి చేశారని ప్రారంభోత్సవానికి వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వ కాలంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కేటీఆర్, హరీశ్‌రావు సహకారంతో అప్పటి ముఖ్యమంత్రిని ఒప్పించి నిధులు తీసుకువచ్చి లైనింగ్ పనులు పూర్తి చేశారని, తర్వాత చుట్టు ప్రక్కల గ్రామాలకు సాగు, తాగు నీరు వచ్చిందని ఆయన గుర్తు చేశారు. దాదాపు మరో రూ.500 కోట్లు కేటాయిస్తే మిగిలిన లైనింగ్ పనులను, కెనాల్‌లో మిగిలిన పనులను పూర్తి చేయడంతోపాటు, ల్యాండ్ అక్విజేషన్ కూడా పూర్తి అవుతుందని, అలా చేయకుండా రైతులను మోసగించడానికి కేసీఆర్ చేసిన పనులనే మళ్లీ ప్రారంభించడానికి రావడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలని తెలిపారు. లక్ష ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టును ప్రారంభించటానికి రావడం సిగ్గుచేటని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 90 శాతం పూర్తయిన నక్కలగండిని కూడా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నక్కల గండి ద్వారా ఉదయ సముద్రానికి 3000 క్యూసెక్కుల గ్రావిటీ వచ్చేలా చూడాలని, అందుకోసం నక్కల గండి పూర్తికి రూ. 2000 కోట్లను కేటాయించాలని చిరుమర్తి డిమాండ్ చేశారు. ఏ నిధులు కేటాయించకుండా మొక్కుబడిగా ప్రాజెక్టులను ప్రారంభించి, ఎన్నికల హామీలుగా మిగిలిస్తే శిలాఫలకాలను ధ్వంసం చేస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, ప్రజలు గొంతు విప్పితే ఆ గొంతు నొక్కి అక్రమ కేసులు పెట్టి నిర్బంధిస్తున్నారని అన్నారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గు చేటని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రజా పాలన ఏడాది ఉత్సవాలు కాదని, నిర్బంధ పాలనకు ఏడాది పేర ఉత్సవాలు నిర్వహించుకోవాలని విమర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, బీఆర్ఎస్ నాయకులు కొలను వెంకటేశ్, సుంకరి యాదగిరి, కొలను సతీశ్, జిట్ట బొందయ్య, కోనేటి యల్లయ్య, ఆగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో రివర్స్‌బుల్ విద్యుత్‌పై సర్వే

సర్వేకు ఉపయోగిస్తున్న డ్రోన్

నందికొండ, డిసెంబర్ 5 : నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్ జలవిద్యుత్ కేంద్రం నుంచి రివర్స్‌బుల్ విద్యుత్ చేపడుతున్న సమయంలో నీటిని పైకి పంపింగ్ చేస్తున్నప్పుడు ఎదురవుతున్న సమస్యలపై సర్వే చేపడుతున్నట్లు జెన్‌కో సీఈ మంగేశ్ కుమార్ తెలిపారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని 8 టర్బన్ల ద్వారా వర్షాకాలంలో వరద నీటిని, అనంతరం నిల్వ ఉన్న నీటిని వినియోగిస్తూ విద్యుత్ ఉత్పత్తి చేపడుతామన్నారు. కృష్ణా నదిలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు నాగార్జునసాగర్ డ్యామ్ ముందు భాగంలో జలవిద్యుత్ కేంద్రం నుంచి టెయిల్ పాండ్ వరకు నిల్వ ఉన్న 7 టీఎంసీల నీటిలో 1 టీఎంసీ నీటిని టర్బన్‌లను రివర్స్‌బుల్ చేస్తూ నీటిని కృష్ణానదిలోకి పోయడం జరుగుతుందని తెలిపారు. తిరిగి మనకు అవసరం ఉన్న సమయంలో నీటిని దిగువకు వదులుతూ విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. నీటిని రివర్స్‌బుల్‌లో పైకి పంపింగ్ చేస్తున్న సమయంలో నీటితో పాటు రాళ్లు, ఇసుక లాంటి వ్యర్థాలు పైకి పోతున్నాయని, వీటి వల్ల టర్బన్లకు, డ్యామ్‌కు ప్రమాదం ఉండడంతో వాటి తొలగింపుపై, రివర్స్‌బుల్‌లో నీరు తగిన స్థాయిలో పంపింగ్ కాకపోవడంపై సర్వే చేపడుతున్నామని చెప్పారు. వాట్స్‌కో కంపెనీకి చెందిన హైడ్రాలజిస్ట్‌లు డ్రోన్ సయంతో జలవిద్యుత్ కేంద్రం ముందు భాగం నుంచి టెయిల్‌పాండ్ వరకు ఎంతవరకు ఇసుక, రాళ్ల గుట్టలు, మట్టి గుట్టలు ఉన్నాయి అనే అంశాలను, నీరు ఎంత వేగంగా రివర్స్‌బుల్ అవుతుందనే విషయాలపై సర్వే చేస్తున్నారని తెలిపారు. వీరు సర్వే చేసి ఇచ్చిన నివేదికను ఉన్నతాధికారులకు పంపి, అనంతరం ఉన్నతాధికారులు ఆదేశాలనుసారం చర్యలను తీసుకుంటామని తెలిపారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రానికి మూడు రోజులు సెలవులు

నాగారం, డిసెంబర్ 5 : తిరుమలగిరి మార్కెట్ పరిధిలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల మిల్లుల్లో కొనుగోలు చేసిన పత్తి నిల్వలు అత్యధికంగా పేరుకుపోయినందున ఈ నెల 6, 7, 8 తేదీల్లో మూడు రోజులు సెలవు ప్రకటిస్తున్నట్లు తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి తెలిపారు.

రైతులు తాము తెచ్చే పత్తి ఎగుమతులు, దిగుమతుల దృష్ట్యా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, రైతులు గమనించి సెలవు రోజుల్లో పత్తిని తీసుకురాకుండా సహకరించాలన్నారు.

సర్కారు మాటలు నమ్మని రైతన్న

- కొనుగోలు కేంద్రాల్లో కాకుండా మిల్లుల్లోనే ధాన్యం అమ్మకం
- సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్నా ముందుకు రాని వైనం
- జిల్లాలో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి.. ప్రభుత్వం కొన్నది 1.98 లక్షలే
- ప్రాసెస్‌లో మరో 20శాతం కోతలు.. ఇంకా 15వేల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం
- ఎక్కువ వరి దిగుబడి వచ్చే నల్లగొండ జిల్లాలోనే ఇలా..
- జనవరి నుంచి రేషన్ ద్వారా సన్నబియ్యం ఇచ్చేనా?

నల్లగొండ, డిసెంబర్ 5 : 'దొడ్డు ధాన్యం క్వింటాకు రూ.2,320 ఇస్తాం.. సన్న ధాన్యానికి క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ అందజేస్తాం' అని వానకాలం కోతలు మొదలైన దగ్గర నుంచి ఊకదంపుడు ఉపన్యాసాలను చేసిన ప్రభుత్వ పెద్దల మాటలను జిల్లా రైతాంగం పట్టించుకోలేదు. అరకొరగానే రుణ మాఫీ, రైతు భరోసా ఊసే లేకుండా పోవడంతో సీఎం, మంత్రుల మాటలు నమ్మేటట్టు లేదని పండించిన ధాన్యాన్ని రైతులు నేరుగా మిల్లుల్లోకి తీసుకెళ్లి అమ్మారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్‌లో పేరుకే కొనసాగాయి. నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి మొత్తం 7.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని అధికార యంత్రాంగం ప్రకటించినప్పటికీ ఇప్పటిదాక రెండు లక్షల మెట్రిక్ టన్నులు దాటకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా జిల్లాలో ఇప్పటికే 80శాతం వరి కోతలు పూర్తి కాగా ఇంకా 20శాతం మాత్రమే ఉన్నాయి. అవి కూడా సన్నాలే కావడంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చే పరిస్థితి లేదని వ్యవసాయ అధికారులే అంటున్నారు. ఈ సీజన్‌లో సన్నాలు కొనుగోలు చేసి వచ్చే జనవరి నుంచి రేషన్ ద్వారా సన్న బియ్యం ఇస్తామన్న ప్రభుత్వం చెబుతున్నది. పెద్ద జిల్లా అయిన నల్లగొండలోనే ఇప్పటి వరకు 18వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారంటే ఉచిత బియ్యం పరిస్థితి ఏంటనే ప్రశ్నకు సర్కారు పెద్దలే సమాధానం వెతుక్కోవాల్సి ఉంది.

సెంటర్లకు 25శాతం ధాన్యమే..

జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 5.20 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా అందులో సన్నరకం 53శాతం, దొడ్డు రకం 47శాతం ఉన్నాయి. మొత్తంగా 12.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా స్థానిక అవసరాలు పోను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా 7.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అధికారులు కొనుగోలు చేస్తామని ప్రకటించిన ధాన్యంలో ఇప్పటి వరకు 25శాతం ధాన్యం మాత్రమే ప్రభుత్వ రంగ కొనుగోలు కేంద్రాలకు రాగా మరో 10వేల మెట్రిక్ టన్నులు సెంటర్లల్లో ఉన్నది. ఇందులో దొడ్డు వడ్లు 1.74లక్షల మెట్రిక్ టన్నులు, సన్నాలు 18వేల మెట్రిక్ టన్నులే. ఇక మరో 20శాతం కోతలు ఉన్నప్పటికీ అవి పూర్తిగా సన్నాలే కావడంతో మిల్లుల్లోనే రైతులు అమ్మే అవకాశం ఉన్నది.

ప్రభుత్వ పెద్దల మాటలపై భరోసా లేక..

ప్రభుత్వ పెద్దల మాటలు నమ్మని రైతులు వారు పండించిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వ రంగ సంస్థల్లో అమ్ముడానికి ఇష్టపడలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నప్పటికీ రైతుల నమ్మకాన్ని చూరగొనలేపోయిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. క్వింటాకు రూ.2,320 ఇస్తామని..సన్న ధాన్యం పండించిన రైతులకు బోనస్ ఇస్తామని చెప్పినప్పటికీ నమ్మకుండా మిల్లుల్లోనే అమ్మినట్లు రైతుల చెప్పుతున్నారు. రుణ మాఫీ చేస్తామని అరకొరగానే చేసిన సర్కార్ గత యాసంగిలో మాత్రమే రైతు బంధు ఇచ్చి రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ. 15వేలు ఇస్తామని ఇప్పటి వరకు రెండు సీజన్‌లుగా ఇవ్వలేదు. దీంతో బోనస్ కూడా నమ్మలేకనే మిల్లుల్లో అమ్మినట్లు రైతులు అంటున్నారు.

సన్నాలే రాలే.. ఉచిత బియ్యం ఎలా?

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేషన్ కింద పేదలకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తామని ప్రకటించినా ఈ సీజన్‌లో కొనుగోలు చేసి వచ్చే జనవరి నుంచి ఇస్తామని ప్రకటించి ఏర్పాట్లు చేస్తున్నది. కొనుగోలు కేంద్రాలకు సన్న బియ్యమే రాకపోవడంతో ఉచిత బియ్యం పరిస్థితి ఏంటో ప్రభుత్వ పెద్దలకే తెలియాలి. రాష్ట్రంలో అత్యంత నిడివి కలిగి ఎక్కువ వరి దిగుబడి వచ్చే నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌లో 2.70లక్షల ఎకరాల్లో సన్న ధాన్యం సాగు అయినప్పటికి ఇప్పటి వరకు కేంద్రాలకు వచ్చింది 18వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. కొనుగోల్లు ముగిసే సరికి మరో పదివేల మెట్రిక్ టన్నుల మేరకు రావచ్చు. మిగతా జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ సర్కార్ సన్న బియ్యం పంపిణి ఏమైద్దో చూడాల్సిందే. ఇదిలా ఉండగా ఆయకట్టులో వానకాలం సీజన్‌కు సంబంధించి ఇంకా 20 శాతం కోతలు ఉండగానే నాన్ ఆయకట్టులో యాసంగి సీజన్‌కు సంబంధించి నాట్లు షురూ అయ్యాయి. ఈ ఏడాది యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 5,83,620 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

మిర్యాలగూడ శివారులోని మిల్లుల వద్ద ధాన్యం ట్రాక్టర్లు

ఇప్పటి వరకు 1.98లక్షల మెట్రిక్ టన్నులు కొన్నాం

జిల్లా వ్యాప్తంగా 340 కేంద్రాలు ప్రారంభించి ఇప్పటివరకు 1.98లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ఇంకా ఆయా సెంటర్లల్లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నందున ఎప్పడికప్పుడే తేమ శాతం చూసి కొనుగోలు చేస్తున్నాం. ఇంకా కోతలు కూడా పూర్తి కానుందున రైతులు సెంటర్లకు తెచ్చిన ప్రతి గింజా కొనుగోలు చేసే విదంగా చర్యలు తీసుకుంటున్నాం. మొత్తం 35,120 మంది రైతుల నుంచి రూ.464.1కోట్ల విలువైన ధాన్యం కొన్నాం.

-హరీశ్, సివిల్ సప్లై డీఎం, నల్లగొండ